క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి సత్తెనపల్లికి చెందిన కాకాని మహేశ్వరరావు, విజయ కుమారి దంపతులు విరాళంగా రూ.1.00,116 అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఈవో నలబోతు మాధవిని కలిసి చెక్కును అందించారు. నూతన ఆలయ నిర్మాణం వేగంగా సాగుతోందని, దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈవో కోరారు.

దళితుల రక్షణ ప్రభుత్వం బాధ్యత



నాదెండ్ల: మతంతో సంబంధం లేకుండా దళితులకు రిజర్వేషన్లు, అట్రాసిటీ చట్టాల రక్షణ కల్పించాలని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్. సుబ్బారావు కోరారు. నాదెండ్లలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం మారిన దళితులకు అట్రాసిటీ చట్టం ద్వారా రక్షణ కల్పించలేమనడం సరికాదని పేర్కొన్నారు. దేశంలో కుల వ్యవస్థ, దళితులపై వివక్ష తీవ్రంగా ఉండటంతోనే ఇతర మతాల్లోకి మారుతున్నారని తెలిపారు. దళితులు మతం మారినప్పటికీ తీవ్ర వివక్ష ఎదుర్కొంటున్నారని చెప్పారు. మతం మారినంత మాత్రాన కుల వివక్ష పోలేదని, దళితులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని గతంలోనే పలు కమిటీలు స్పష్టం చేశాయని గుర్తు చేశారు. దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు రాజ్యాంగపరంగా హక్కులు, రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, జి. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టుదలతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ

సీఐ విజయ్‌చరణ్



నరసపేట టౌన్: పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను చేరుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ సూచించారు. 10వ తరగతి ఫలితాల్లో వరవకట్ట ప్రాంతానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడంతో ఆదివారం వారి ఇళ్లకు సీఐ వెళ్లి సన్మానించి మాట్లాడారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను నిర్వహించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారని తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులు షేక్ హాజీరా, మొహమ్మద్ సనా తయ్యాబా, షేక్ హనీఫ్‌లను సీఐ ఎం. విజయ్ చరణ్, ఎస్ఐ వంశీకృష్ణలు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పుస్తకాలు, పెన్నులు బహూకరించి అభినందించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట రూరల్: పెదతురకపాలెంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.వెంకటసుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో- 40, 6వ తరగతిలో- 21, 7వ తరగతిలో- 3, 8వ తరగతిలో- 1, 9వ తరగతిలో- 3 ఖాళీలు ఉన్నాయని ఆమె వివరించారు. 5వ తరగతిలోని ఖాళీలలో ఎస్టీలకు -30 సీట్లు, ఎస్సీలకు -5, బీసీలకు- 2, ఓసీలకు- 1, ఈబీసీలకు- 1 సీటు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన తరగతులలోని ఖాళీలను ఎస్టీటీలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న సీట్లకు బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఖాళీల కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిలో ఎంపిక జరుగుతుందని తెలిపారు. వివరాలకు 7382659411, 9701051815 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

తొలగించిన పింఛన్లు ఇవ్వకపోతే ఆందోళన

మాజీఎమ్మెల్యే బొల్లా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా తదితరులు

వినుకొండ: శావల్యాపురం మండలం పిచికలపాలెం, పోట్లూరు, కొత్తలూరుతో పాటు పలు గ్రామాలల్లో ప్రభుత్వం అకారణంగా నిలపివేసిన పింఛన్లను 24 గంటల్లో తిరిగి ఇవ్వాలని, లేనిపక్షంలో వినుకొండ ప్రధాన సెంటరులో నిరసన చేపడతామని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కడం, అక్రమంగా అరెస్టులు చేసి కేసులు నమోదు చేయడం దారుణమని ఖండించారు. పోలీసుల సహకారంతో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడం తప్పా చేసిందేమీలేదని విమర్శించారు. ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, కనీసం పండించిన పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించలేదని తెలిపారు.రాజధాని, అమరావతి కోసం 29 గ్రామాల రైతులు ధర్నా చేశారని, వారికే న్యాయం జరగక పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. తొలుత రాజధాని కోసం చంద్రబాబు 33 వేల ఎకరాలు సేకరించారని, మరలా ఇప్పుడు మరో 44 వేల ఎకరాలు సేకరిస్తామని చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికే సినీ నటుడు బాలకృష్ణ, టీవీ 5 బీఆర్‌నాయుడు, ఏబీఎన్ రాధాకృష్ణ, భ్రమర రియల్ ఎస్టేట్ వారు భూములు కొన్నారని, అదే ప్రాంతంలో సేకరించడం వెనుక రాజకీయ లబ్ధి ఉందని ఆరోపించారు.

పేదల నోరు కొట్టడం సబబు కాదు

వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేదల పింఛన్లు తొలగించడం తప్పా చేసిందేమీలేదని మాజీ ఎమ్మెల్యే బొల్లా విమర్శించారు. కనీసం ఎందుకు తొలగించారో చెప్పాలని అడిగినా అధికారులు సమాధానం ఇవ్వడం లేదన్నారు. పేదల నోరు కొట్టడం ఎంతవరకు న్యాయమని బొల్లా ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తిరుబాటు వస్తుందని, అప్పుడు ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు.

రేషన్ డీలర్ల పైనా వేధింపులు

శావల్యాపురం మండలం పోట్లూరు రేషన్ డీలరుపై అధికార పార్టీ నాయకులు వేధింపులు కొనసాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే బొల్లా తెలిపారు. రేషన్ బియ్యం ఇవ్వకుండా మొత్తం తమకే అమ్మాలని రేషన్ మాఫియా బెదిరింపులకు దిగడం ఏమిటని ప్రశ్నించారు. వినుకొండలో రేషన్, మట్టి, ఇసుక, మద్యం, భూముల మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించే రోజులు దగ్గర పడ్డాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మాజీ కౌన్సిలర్ సత్తార్ ఆకస్మిక మృతి



షేక్ సత్తార్ (52)



సత్తార్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: స్థానిక ఎనిమిదో వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ సత్తార్(52) ఆదివారం గుండెపోటుతో అకస్మికంగా మృతి చెందారు. ఆయన 2014 నుంచి 19వరకు పురపాలక కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌గా వ్యవహరించారు. మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంగళరెడ్డి కాలనీలోని సత్తార్ స్వగృహానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. సత్తార్ మృతి వారి కుటుంబానికే గాక పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టర్, వార్డు ఇన్‌చార్జి షేక్ కరిముల్లా, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ అబ్బాస్, పలువురు పార్టీ మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సాయంత్రం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

7న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన వేడుకలు

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లిలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన వేడుకలు ఈనెల 7న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి పులుకూరి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతల సౌజన్యంతో గత కొన్ని సంవత్సరాల నుంచి వేడుకలను ఘనంగా నిర్వహించుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం నుంచి స్వామికి అభిషేకాలు, అర్చనలు విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. వేడుకలకు దేవాలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు తెలియజేశారు. స్వామిని దర్శించుకునే భక్తులకు అన్న సంతర్పణ కూడా ఏర్పాటు చేశామని వివరించారు. మరిన్ని వివరాలకు 9849142203ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష



ఇర్లపాడులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత



పరీక్షకు హాజరైన విద్యార్థులు

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయంలో ఆదివారం నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 164 మందికి గాను 154 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ పరీక్ష జరిగింది. ఉదయం 11 గంటల నుంచి హాలులోకి విద్యార్థులను అనుమతించారు. మధ్యాహ్నం 1.30 తర్వాత ఆపేశారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల చుట్టుప్రక్కల ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయించారు. సెంటర్ సిటీ కోఆర్డినేటర్‌గా కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ నీరజ్‌కుమార్ శ్రీ వత్స, సూపరింటెండెంట్‌గా ఎస్. విజయకుమార్ వ్యవహరించారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే, ఆర్డీవో మధులత, తహసీల్దార్ ఏవీ రమణ తనిఖీ చేశారు. మౌలిక వసతులను పరిశీలించి, ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. అబ్జర్వర్‌గా రొంపిచర్ల ఎంఈవో బ్రహ్మేశ్వరరావు వ్యవహరించారు. నాదెండ్ల ఎస్ఐ జి. పుల్లారావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

నరసరావుపేట: నాడు కార్మికులు ప్రాణాలు అర్పించి సాధించుకున్న హక్కులను నేడు కేంద్రంలోని బీజేపీ ఎన్‌డీఏ ప్రభుత్వం హరిస్తోందని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాషా పేర్కొన్నారు. పనసతోట నాల్గవ రోడ్డులో ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో మేడేను నిర్వహించి, జెండాను ఎగురవేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ చట్టాలుగా మార్చడాన్ని ఖండించారు. ఈ మేడే స్ఫూర్తితో వాటిని ఎదిరించి రద్దు చేసే వరకూ పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి మస్తాన్ షరీఫ్, మండల కార్యదర్శి మస్తాన్‌వలి, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి హాల్ట్



కేజీబీవీ పాఠశాలలో అసంపూర్తి భవనం



నూజెండ్ల జెడ్పీ పాఠశాలలో నిలిచిపోయిన నిర్మాణం

- పాఠశాలల్లో ముందుకు సాగని నిర్మాణ పనులు
- నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం

నూజెండ్ల: మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వం నాడు- నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీటం వేసింది. ఇందులో భాగంగా నూజెండ్ల కేజీబీవీకి, జిల్లా పరిషత్ పాఠశాలకు రూ. 60 లక్షలు మంజూరు చేసింది. వీటితో ఎనిమిది గదుల నిర్మాణం చేపట్టారు. పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి.

ఎక్కడి పనులు అక్కడే !

ప్రభుత్వం మారిన తర్వాత కొంత కాలంగా మిగతా పనులకు నిధులు విడుదల కాక ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. కేజీబీవీ గురుకుల పాఠశాలలో నూతనంగా ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించడంతో తరగతి గదుల కొరత వచ్చింది. దీంతో భోజనశాలలో, డార్మటరీ గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడం, స్కాట్ వంటి బోధనేతర అంశాలు ప్రవేశపెట్టడంతో తరగతి గదుల ఆవశ్యకత ఏర్పడింది. నిలిచిపోయిన నిర్మాణాలకు నిధులు కేటాయించి వచ్చే విద్యా సంవత్సరానికైనా తరగతి గదులు అందుబాటులో తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై కస్తూరిబా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి వివరణ ఇస్తూ అసంపూర్తి భవనాల మిగిలిన పనులకు అంచనాలు పూర్తయ్యాయని తెలిపారు. మన బడి- మన ప్రభుత్వం ద్వారా ఇప్పటికే నిదులు మంజూరు చేశారని, వచ్చే విద్యా సంవత్సరానికి తరగతి గదులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

ఉద్యోగులు రాజకీయాలకు దూరంగా ఉండాలి

సహకార శాఖ మహాజన సభలో ఎమ్మెల్యే చదలవాడ



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడను సన్మానిస్తున్న ఉద్యోగులు

నరసరావుపేట: సహకార శాఖ ఉద్యోగులంతా కుల, మత, రాజకీయాలకు దూరంగా ఉంటూ రైతులకు అండగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన వ్యవసాయ సహకార సమితి ఉద్యోగుల మహాజన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రుణాలు ఇవ్వడంలో రాజకీయాలు చూడవద్దని కోరారు. పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు చేయాలనే సహకార ఉద్యోగుల డిమాండ్‌ను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తీరుస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరపతి సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆరాధ్యుల శ్రీనివాసరావు, పోకా కోటేశ్వరరావు, మహిపతి లక్ష్మీనారాయణ, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, ఏ.వెంకటనారాయణ, డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ సిలార్ మసూద్
- 46వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల దీక్షలు



శిబిరంలో కార్మికులతో సిలార్, సాల్మన్

నరసరావుపేట: పెరిగిన పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి పౌరుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతను, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు విస్మరిస్తున్నారని సీఐటీయు జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ సిలార్ మసూద్ విమర్శించారు. నెల పని చేస్తున్నా పది పదిహేను రోజులకే జీతాల చెల్లించటాన్ని నిరసిస్తూ 34మంది కార్మికులు చేపట్టిన నిరసన దీక్షా శిబిరాన్ని 46వ రోజు ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలలో 30 రోజులు పనిచేస్తున్నా తలొక విధంగా జీతాలు చెల్లించటం సరికాదని అన్నారు. రోజుకు రూ.700 చొప్పున 30 రోజులకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 46రోజుల నుంచి కార్మికులు నిరసన తెలుపుతున్నా అధికారుల్లో స్పందన లేకపోవడం దారుణమని ఖండించారు. పట్టణ అధ్యక్షుడు సాల్మన్ మాట్లాడుతూ ఆప్కాస్‌లో ఉన్న కార్మికులకు నెల రోజుల జీతం చెల్లించాలని కోరారు. కొంతమందికి బదిలీ కార్మికుల పేరు పెట్టి శ్రమదోపిడీ చేయడం తగదని తెతలిపారు. గతేడాది కార్మికులు సమ్మె చేస్తుండగా సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మద్దతు తెలియజేసి ఇప్పుడు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ఆయన వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో కార్మిక వర్గాన్ని సమీకరించి సమ్మెబాట పడతామని హెచ్చరించారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో కార్డన్ సెర్చ్



తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు

నరసరావుపేట రూరల్: ఉప్పలపాడు సమీపంలోని జగనన్న కాలనీలో శనివారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ఇళ్లను తనిఖీ చేశారు.
అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, వన్‌టౌన్ సీఐలు ఎం.వి. చరణ్, ట్రాఫిక్ సీఐ సీహెచ్. లోకనాథం, ఎస్ఐ కిశోర్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్టు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.
గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీసినట్టు తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వివరించారు.



శావల్యాపురం జెడ్పీ హైస్కూలులో గురువులతో పూర్వ విద్యార్థులు

స్కూల్ డేస్... హ్యాపీ డేస్

శావల్యాపురం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలో ఘనంగా నిర్వహించారు.1999-2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 40 మంది కుటుంబ సభ్యులతో కలసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని, ఆనాటి మధుర జ్ఞాపకాలు, తరగతి గదుల్లో తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. చదువు నేర్పిన ఉపాధ్యాయులు సీహెచ్. చంద్రశేఖర్, కె.పద్మేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, ఎ.ఏలీషా, రాంబాబును పూలమాలలు, దుశ్శాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముంద్రు రామారావు, వడ్లమూడి శ్రీనివాసరావు, చలువాది ప్రభుకుమార్, రెడ్డి వెంకట కిరణ్‌కుమార్, నాగరాజు, చింతా ప్రసాద్, కోమలి, అమృతపూడి శాంతి, చైతన్య పాల్గొన్నారు.

వినుకొండలో..

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఫస్ట్ వార్డు హైస్కూలు)లో 2000-2001లో టెన్త్ చదివిన విద్యార్థుల సమ్మేళనం పల్నాడు రోడ్డులోని బృందావన్ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి పలువురు హాజరయ్యారు. 24 ఏళ్ల తరువాత కుటుంబ సభ్యులతో కలసి కార్యక్రమానికి హాజరై, గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, విశ్రాంత ఎంఈవోలు మందపాటి వెంకటేశ్వర్లు, జాన్ సుందరరాజు, రామారావు, ఉపాధ్యాయులు రమణారెడ్డి, నాగేశ్వరరావు, రాఘవాచారి పాల్గొన్నారు.



వినుకొండ హైస్కూలులో ...